భారంగా మధ్యాహ్న భోజనం

- నాలుగు నెలలుగా అందని బిల్లులు
- అప్పుచేసి భోజనం తయారీ
- వెతలు తీర్చాలని వంట కార్మికుల వినతి

కరకగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు ఆహారం అందిస్తున్న వంట కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత నాలుగు నెలలుగా వారికి ప్రభుత్వం నుంచి బిల్లులు అందకపోవడంతో అప్పులు తెచ్చి మరీ విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారు. ఈ పరిస్థితి వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

బిల్లుల జాప్యంతో సమస్యలు

మండలంలో 37 ప్రాథమిక, 03 జెడ్పీ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీలు ప్రతి నెలా సరుకులు, కూరగాయలు, గ్యాస్, వంట కార్మికుల జీతాలకు వేల రూపాయలు ఖర్చు చేయాలి. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో బయట వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ పిల్లలకు భోజనం వండి పెడుతున్నారు. అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం అని పలువురు వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఏజెన్సీలు అప్పులు పుట్టక సరుకులు కొనలేక భోజనం అందించడం ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది.

దీనికి తోడు పెరిగిన ధరలు నూతన మెనూ అమలు వంట కార్మికులకు సవాలుగా మారింది. వారి జవనోపాధి లేక కుటుంబ పోషణ కష్ట తరంగా మారింది.



కరకగూడెం జెడ్పీ పాఠశాలలో వంట చేస్తున్న కార్మికులు



భట్టుపల్లి పాఠశాలలో గుడ్లు సిద్ధం చేస్తున్న కార్మికురాలు

జీతం వస్తేనే పూట గడిచేది..



మాకు జీతం వస్తేనే పూట గడుస్తుంది. నాలుగు నెలలుగా డబ్బులు రాక అప్పులు చేయాల్సి వస్తోంది. పిల్లలకు రుచికరమైన భోజనాన్ని వండించడానికి నిరంతరం శ్రమిస్తునే ఉంటాం. ప్రభుత్వం మా కష్టాన్ని గుర్తించి బిల్లులు విడుదల చేయాలి.

– సావిత్రి, వంట కార్మికురాలు, కరకగూడెం జెడ్పీ పాఠశాల

అప్పులు చేసి వంట చేస్తున్నాం..



ప్రతి రోజు ఉదయాన్నే లేచి పిల్లల కోసం వంట చేస్తున్నాం. వారికి మంచి భోజనం పెట్టాలని మాకు ఉంటుంది. కానీ బిల్లులు రాకపోవడంతో సరుకులు కొనడం కూడా కష్టంగా మారింది. అప్పులు చేసి వంట చేస్తున్నాం. మా పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

– అమ్మక, వంట కార్మికురాలు, భట్టుపల్లి పాఠశాల

త్వరలోనే బిల్లులు వస్తాయి..



వంట ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. ఈ సమస్యను పరిష్కరించడానికి ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ విడుదల చేస్తామని హామీ ఇస్తున్నాం. విద్యార్థులకు నిరంతరం మధ్యాహ్న భోజనం అందేలా చూస్తున్నాం.

– గద్దం మంజుల, ఎంఈఓ, కరకగూడెం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అగ్రస్థానం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చంద్రుగొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్రంలోనే అశ్వారావుపేట నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రం చంద్రుగొండలోని మసీద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పలు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి అయిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, పీఆర్ డీఈ సైదుల్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, ఫజల్ బక్ష్, ఇమ్రాన్, మసీద్ కమిటీ సదర్ ఎండి.షమీహుసేన్, యాకూమ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రి ఈ తరానికి స్ఫూర్తి

చర్ల: స్వాతంత్ర్య సమర యోధుడు చింతలచెర్వు వెంకటాద్రి ఆ తరానికి, ఈ తరానికి ఓ స్ఫూర్తి అని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కొనియాడారు. మంగళవారం చర్ల మండలంలోని రైస్‌పేటలోని శైలజ విహార్‌లో వెంకటాద్రి వర్ధంతి సభ ఆయన మనుమడు, హైకోర్టు అడ్వకేట్ సీవీ సతీష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చర్లలోని శాఖాగ్రంథాలయ ఆవరణలో ఉన్న వెంకటాద్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో వెంకటాద్రి సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలను, బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీవీ రమణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గా ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



చింతలచెర్వు వెంకటాద్రి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కల్తీ మాంసం విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపాలిటీ కమిషనర్ నాగరాజు

అశ్వారావుపేటరూరల్: మాంసం దుకాణాలదారులు వినియోగదారులకు కల్తీ, నిల్వ ఉంచిన వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీ కమిషనర్ బి.నాగరాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మాంసం దుకాణాలదారులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మాంసం దుకాణాలు పరిశుభ్రంగా ఉండాలని, దుమ్ము, ధూళి పడకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మాంసం, చేపల దుకాణదారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని అన్నారు.

పోలమ్మ తల్లి పండుగ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో పోలమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజ మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిందెలతో మంగళస్నానాలుగా జలాభిషేకం నిర్వహించారు. అఖండ జ్యోతిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. జాతర తుది అంకంగా గంగోలు చెరువు వద్ద ఉన్న పోలమ్మ తల్లి వృక్షానికి పూజలను నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ రెడ్డి సభ్యులు హరిబాబు, వెంకటేశ్వరరావు, కష్టారెడ్డి, అప్పన్న, తాతారావు, అంజి, రాము, రాంబాబు, సుధాకర్, హేమంత్ పాల్గొన్నారు.

'నాసా' ప్రాజెక్టులో ప్రతిభ

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారంలో గల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు స్టార్ బ్లూమ్ అనే నాసా ప్రాజెక్ట్‌తో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతిని సాధించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యుగంధర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల ప్రతిభకు సహకరించిన ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన పోస్టల్ యూనియన్ మహాసభలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని గుప్తా ఫంక్షన్ హాల్‌లో రెండు రోజులుగా నిర్వహించిన నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్–సి మహాసభలు మంగళవారంతో ముగిశాయి. ఈ సభలకు గ్రూప్–సి జనరల్ సెక్రెటరీ వాసిరెడ్డి శివాజీ, మాజీ సెక్రెటరీ జనరల్ కిషన్ రావు, పోస్ట్‌మన్ గ్రూప్–డి, గ్రామీణ డాక్ సేవకులు, రాష్ట్ర నాయకులు హాజరై భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకున్నారు. ప్రస్తుత పరిస్థితులలో తపాలా శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి తీసుకోబోయే నిర్ణయాలను తెలిపారు. అనంతరం నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్–సి రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రెసిడెంట్‌గా ఎం.వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పమ్మి వెంకటేశ్వర్ రావు, కార్యదర్శిగా రామ్ కుమార్, కోశాధికారిగా నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా ఆర్.సంతోష్‌తో పాటు 15 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీవీ రామ్మోహన్‌రావు, బి.రమేష్, భాస్కర శాస్త్రి, తాండ్ర కృష్ణార్జునరావ్, సుధీర్, ఖలీల్, వీరన్న, హుస్సేన్, ఎస్‌వీబీ కుమార్, ప్రసాద్ రెడ్డి, సురేష్, ఈశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని సన్మానించిన రాష్ట్ర నాయకులు

'భవిత'కు తాత్కాలిక భవనం కేటాయింపు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌ను సమగ్ర శిక్ష అభియాన్ భవిత ఫిజియోథెరపీ క్యాంపుకును తాత్కాలికంగా కేటాయించినట్లు తహసీల్దార్ అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. నిరుపయోగంగా ఉన్న రెవెన్యూ గెస్ట్ హౌస్‌ను ఆధునీకరించి, ప్రతీ మంగళవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహిస్తున్న ఐఈఆర్‌టీకి కేటాయించామని తెలిపారు.

బస్టాండ్‌ను పరిశీలించిన డీఎం

దమ్మపేట: దమ్మపేట బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని పలువురు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో.. సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి సిబ్బందితో కలిసి స్థానిక బస్టాండ్‌ను మంగళవారం సందర్శించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భవిష్యత్తులో బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు పెరిగే అవకాశం ఉన్నందున, బస్టాండ్ స్థలాన్ని ఇతరత్రా వ్యాపారాలకు ఉపయోగించొద్దని ఈ సందర్భంగా స్థానికులు డీఎంను కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దుమ్ముగూడెం: మండలంలోని సున్నంబట్టి గ్రామస్తులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌కు తహసీల్దార్ అశోక్‌కుమార్ మంగళవారం జరిమానా విధించారు. సున్నంబట్టి గ్రామంలో సోమవారం రాత్రి అక్రమంగా ఎటువంటి అనుమతులూ లేకుండా ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని కార్యాలయానికి తరలించి జరిమానా విధించారు.

నేడు మంత్రి పర్యటన

దమ్మపేట: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు మండలంలో పర్యటించనున్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకులంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇందిరా మహిళ శక్తి సంబురాలు కార్యక్రమంలో సాయంత్రం 4 గంటలకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొననున్నారు.

సికిల్ సెల్ పరీక్షలు

పినపాక: మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, భూపాలపట్నం, బయ్యారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ వైద్యురాలు దుర్గా భవాని ఆధ్వర్యంలో మంగళవారం సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించారు. వంశపారపర్యంగా వచ్చే వ్యాధిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం తరఫున మొదటి నుండి అందరికీ పరీక్షలు నిర్వహించి వ్యాధి ఉన్నవారిని గుర్తిస్తున్నామన్నారు. వారికి ప్రత్యేక చికిత్సలు అందించడంతోపాటు వారి వివరాలను గోప్యంగా ఉంచుతున్నామన్నారు.

టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

దుమ్ముగూడెం: మండల టీఎస్‌యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఐటీడీఏ సబ్ కమిటీ కన్వీనర్ బాలు మాట్లాడుతూ.. తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలో పోస్టులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ సంఘం శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమాటి వెంకటేశ్వర్లు, మాలోత్ సురేష్ బాబు, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఆధార్ క్యాంప్ ప్రారంభం

మణుగూరుటౌన్: మణుగూరులోని ఆదివాసీ భవన్‌లో మంగళవారం ఆరు కౌంటర్లతో ఆధార్ కేంద్రాన్ని తహసీల్దార్, ఎంపీడీఓల విభాగాల ఆధ్వర్యంలో ప్రారంభించారు. మూడు రోజులు నిర్వహించే ఈ కేంద్రానికి తొలిరోజు లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాలకు మణుగూరులోనే ఏర్పాటు చేయడంతో వందలాది మంది ఆధార్ మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ వంటి కార్డుల కోసం బారులుదీరారు. లబ్ధిదారులకు టెంట్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేసినప్పటికీ.. తరచూ వచ్చిన సర్వర్ సమస్యతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసు సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. ఆధార్ కేంద్రాలను మరో పది రోజులు పొడిగించి అందరికి ఆధార్ కేంద్రం లోపం సమస్యలు తీర్చాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లులు పర్యవేక్షించారు.

దమ్మపేట: దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో మెగా ఆధార్ క్యాంప్‌ను మంగళవారం ప్రారంభించారు. క్యాంపులో మొత్తం మూడు ఆధార్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల నుంచి వందలాది మంది ఆధార్ కార్డులో సవరణల కోసం మంగళవారం క్యాంపునకు హాజరయ్యారు. మొత్తం 88 మందికి సంబంధించిన ఆధార్ కార్డులో సవరణలు చేశారు. కొంతమందికి సరైన ధ్రువపత్రాలు లేకపోవడం వల్ల వెనుదిరిగి వెళ్లిపోయారు. క్యాంపులో ప్రజల సౌకర్యార్థం నీడ కోసం టెంట్, తాగు నీరు తదితర ఏర్పాట్లను చేశారు.



దమ్మపేట: ఆధార్ క్యాంపులో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది



మణుగూరుటౌన్: కేంద్రం వద్ద బారులుదీరిన లబ్ధిదారులు

తుమ్మలచెరువుకు నీరు అందించాలి



విలేకరులతో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ నీటిని తుమ్మలచెరువు రైతాంగానికి అందించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలోని అఖిలపక్ష పార్టీల నాయకులు మంగళవారం బీజీకొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను, కాలువను, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తుమ్మలచెరువుకు తాత్కాలికంగా పంపును ఏర్పాటు చేసి చెరువు నింపాలన్నారు. లేదంటే ఆయకట్టు రైతులతో అఖిలపక్ష రైతు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పంప్‌హౌస్‌ను ముట్టడించి చెరువు నింపేదాక చుక్కనీరు కూడా తరలించకుండా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయకట్టు అఖిల పక్ష రైతులు మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, సురకంటి ప్రభాకర్‌రెడ్డి, మేడవరపు సుధీర్, కొల్లు లింగారెడ్డి, ఆసా శ్రీనివాసరావు, తాటిపాముల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదును వేగవంతం చేయండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రెయినర్ వెంకటేశ్వరరావు

చంద్రుగొండ: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా చేయాలని తహసీల్దార్లు సంధ్యారాణి, పుల్లారావులు బూత్‌లెవల్ అధికారులకు సూచించారు. మండలకేంద్రం చంద్రుగొండలోని రైతువేదికలో మంగళవారం చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి రెండు మండలాల బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో పేర్లు, ఇంటి నంబర్లు తప్పుగా ఉన్నా వాటిని సరిచేయాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రెనీలుగా వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

మణుగూరురూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి మాదాసు అఖిల్ డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హర్షవర్ధన్, మనోజ్, తేజస్విని, సంగీత, రమ్యశ్రీ, నందిని, సంజన, పావని, రంజిత్, జశ్వంత్, నాగ సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నాటి గురువులు

మణుగూరురూరల్: మండలంలోని పీవీకాలనీలోని సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన 2002–03 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సమ్మేళనానికి పాఠశాల మాజీ ఉపాధ్యాయుడు జేవీ కృష్ణారావు, అరుణలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం పూర్వ విద్యార్థులు వారు పని చేస్తున్న రంగాలను వివరిస్తూ.. విద్యార్థి దశలో వారు చేసిన విద్యాభ్యాసం, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులు యామిని, మాధవరావు, రాజేష్, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఓ టూ జీఎంకు సన్మానం

మణుగూరురూరల్: ఇటీవలే పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్‌ఓ టూ జీఎం బసవోజు శ్రీనివాసచారిని ఏఐటీయూసీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, నాయకులు రామనర్సయ్య, గుండెపిన్ని పుల్లారావు, మేకల ఈశ్వర్‌రావు, ఆవుల నాగరాజు, గోలి గంగాధర్‌రావు, ఆదెర్ల సురేందర్, రాజాశేఖర్, వి.సాయిప్రకాష్ చారి, రమేష్ పాల్గొన్నారు.

మహిళలకు రక్తహీనత పరీక్షలు

మండలాల్లోని మహిళా సమాఖ్య సభ్యులకు ఆయా ప్రాంతాల్లోన్ని పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మంగళవారం రక్త హీనతను గుర్తించే పరీక్షలు నిర్వహించారు. ఇందుకోసం ప్రత్యేక కిట్లను వినియోగించారు. రక్తహీనత ఉన్న మహిళలను గుర్తించి మందులు అందించడంతోపాటు, తీసుకోవాల్సిన పోషికాహారాన్ని ఈ క్యాంపుల్లో వివరించారు.

అశ్వారావుపేటరూరల్: వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ పర్యవేక్షణలో స్థానిక ఐకేపీ కార్యాలయంలో 70 మంది మహిళా సభ్యులకు రక్త పరీక్షలు చేశారు. రిపోర్టులను అందించి, మందులు పంపిణీ చేశారు. ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర రెడ్డి, డీపీఎంఓ మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ ఉష, మాధురి, శ్రవంతి, ఏఎన్‌ఎంలు జ్యోతి, అరుణ, సుజాత, భూలక్ష్మి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మణిదీప్ ఆధ్వర్యంలో 28 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం వినోద్ క్రాంతి, సీసీ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి అవసరమైన మందులను అందజేశారు. ఏపీఎం త్రిగుణ, హెచ్ఈఓ పోలెబోయిన కృష్ణారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తన్మయ్, సిబ్బంది మీరాబీ, ఎస్తేర్‌రాణి, జయలక్ష్మి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: మహిళలకు రక్త పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



కరకగూడెం: రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రవితేజ

క్లుప్తంగా

మినుము మినీ కిట్ల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఆహార భద్రత పథకం, పోషణ మిషన్ కింద రైతులకు మినుము మినీ కిట్ బ్యాగ్‌లను ఏడీఏ పి.రవి కుమార్ పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో ఆసక్తి ఉన్న రైతులకు సబ్సిడీపై అందించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులు పప్పు ధాన్యాల సాగును పెంచాలని, ఆసక్తి ఉన్న రైతులు పట్టా పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో స్థానిక ఏఓ కార్యాలయంలో దరఖాస్తులు చేస్తే మినీ కిట్‌లను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ శివరామ ప్రసాద్, ఏఈఓలు సతీష్, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి

దమ్మపేట: దమ్మపేట మేజర్ గ్రామ పంచాయతీలో వర్షాకాలం దృష్ట్యా వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, సీపీఎం జిల్లా నాయకులు పిట్టల అర్జున్ కోరారు. ఈ మేరకు మంగళవారం దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డికి సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. వార్డుల్లో పేరుకుపోయిన చెత్తచెదారం వల్ల దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. డ్రెయినేజీలో పూడికలను తీసి, అవసరమైనచోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొప్పుల శ్రీను, మురహరి రఘు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలోని ప్రైవేట్ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి ఫీజులను వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ వినియోగదారులు, మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి చెట్టి జస్వంత్ ఎంఈఓ టి.రమకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో 25 శాతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలు ఉచిత విద్యను అందించాలని, జర్నలిస్టుల పిల్లలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రైవేట్ పాఠశాలలు ఫీజులలో 50 శాతం రాయితీ కల్పించాల్సి ఉందని తెలిపారు. ఈ నిబంధనలు అమలు చేసేందుకు సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జాతీయ వినియోగదారులు, మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

17న మహాధర్నా

మణుగూరురూరల్: ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన మణుగూరు మండల కేంద్రంలో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు సోలం హరిశంకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు మడి రమేష్, కంగాల ప్రవీణ్, కొంగ్రు నాగేంద్ర, సోలం సంపత్, కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతదేహానికి నివాళి

అశ్వాపురం: అనారోగ్యంతో మృతి చెందిన మండల పరిధిలోని చింతిర్యాల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కల్లూరి లక్ష్మీనారాయణ మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు ఓరుగంటి రమేష్, పూనెం కోటయ్య, రామారావు, ఏనిక రవి, తెల్లం వీరభద్రం, హర్ష, గొల్లపల్లి నరేష్, విజయ్, శశికాంత్, నరసింహారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న వైరా ఎస్సై, హెచ్‌ఎం తదితరులు

ములకలపల్లి: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన పుష్పాల జగన్నాథం–ఇందిరమ్మ జ్ఞాపకార్థంగా వీరి కుటుంబీకులు ఈ ఏడాది పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన పొగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అన్నవరపు ఉదయ్ గణేష్‌కు రూ.6వేల నగదు, ములకలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని సున్నం శశికళకు రూ.5వేల నగదు చొప్పున ప్రోత్సాహకం అందించారు. సన్మానం చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత వైరా ఎస్సై పుష్పాల రామారావు, హెచ్‌ఎం లత, పుష్పాల చందర్‌రావు, పుష్పాల సాయి, సందకూరి లక్ష్మి, మండల ప్రముఖులు పాల్గొన్నారు.